# ఆటవెలది

అరమోడ్పు కనులతో సుషుప్త్యవస్థలో నున్న కంపెనీ కార్యదర్శిగారు నా అడుగుల సవ్వడికి తృళ్ళిపడి లేచారు.

"నమస్తే సార్" అన్నాను.

"ఎవరు నువ్వు?" అన్నారు కోపంగా. అతనికి నిద్రాభంగం కలిగించానని.

'నా పేరు కాంతారావండీ"

"ఏం పని?" అన్నారు ఇంకా అదే ధోరణిలో.

"వారం రోజుల క్రిందట మీకు ఎమ్.ఎల్.ఎ.గారి వద్ద నుంచి లెటర్...." అన్నాను జంకుతూ.

"ఓ! నువ్వా? కూర్చో" అన్నారు టేబిల్ మీద నుంచి కాళ్ళు దించుతూ.

ఎదురుగా వున్న కుర్చీలో కూర్చున్నాను.

"ఈమారు వేకెన్సీ ఏదైనా వస్తే నిన్ను తప్పకుండా తీసుకుంటానన్నారు"

"ఊఁ! అవుతే"

"మీకు 'పెరసనల్ స్టెనో' కావాలని పత్రికలో వేసిన అడ్వర్టైజ్‌మెంట్ చూసాను. దయచేసి ఆ పోస్టు నాకు యిప్పించమని...."

"నీ క్వాలిఫికేషన్స్"

"బి.ఏ. పాసయ్యాను. టైప్, షార్ట్‌హేండ్ హయ్యరు పాసయ్యాను. ఇవిగో సర్టిఫికేట్స్ చూడండి" అంటూ నా చేతిలో ఫైల్ తెరిచి ఆయన ముందుంచాను.

ఆయన నా సర్టిఫికేట్సన్నీ నిదానంగా చూసారు.

"చూడు మిస్టర్ కాంతారావ్ ఆ పోస్టు రిజర్వుడు. నీకివ్వడానికి వీల్లేదు. ఇంకేదైనా కాళీ వచ్చినప్పుడు చూస్తాలే" అన్నారు.

"కాని మీ ఎడ్వర్‌టైజ్‌మెంట్...."

"మిస్టర్ అదంతా నీకనవసరం. ఇక నీవు వెళ్ళవచ్చు" అన్నారు తన దృఢకాయాన్ని వెనక్కి కుర్చీలో చేరవేస్తూ.

నాకు నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఉన్న ఒక్క ఆశ కూడ నిరాశయింది.

మెల్లిగా అతని ఆఫీసులో నుంచి బయటపడ్డాను. ఇంక ఇప్పుడేం చెయ్యడం. ఎక్కడ చూసినా "నో వేకెన్సీ" బోర్డు కళ్ళ కెదురు. బయట ఎండ నెత్తి మాడిపోతున్నది. చేతిలో ఒక్క నయాపైసా కూడా లేదు. ఉదయం బస్సు ఛార్జీ పోను మిగిలిన రెండణాలు కార్యదర్శిగారి ప్యూనికి కాఫీ కట్నం సమర్పించాను. లేకుంటే ఆయన దర్శనం కాదు.

"ఏమండీ! ఇంట్లో బియ్యం నిండుకున్నాయి. చంటాడి పాలడబ్బా మర్చిపోకండి" శ్రీమతి మాటలు ఇంకా చెవుల్లో గింగురుమంటున్నాయి.

ఇంతలో భొంయ్ మంటూ కారు వచ్చి నా ప్రక్కగా ఆగింది. నేను తృళ్ళిపడి ప్రక్కకు తప్పుకున్నాను. ఒక్క అంగుళంలో ప్రమాదం తప్పింది. లేకుంటే నేను కారు క్రింద పడాల్సింది.

"ఏరా! ఫూల్ కళ్ళు కనిపించటంలేదూ? రోడ్డు మధ్యన నడుస్తున్నావు" అన్నాడు కారులోని వ్యక్తి.

నేను అప్పుడు తెలుసుకున్నాను రోడ్డు మధ్యను నడుస్తున్నానని.

"క్షమించండి....""అరేయ్! కాంతం నువ్వా?" అన్నాడు కారులోని వ్యక్తి తన నల్ల కళ్ళజోడు తీస్తూ.

"పుండరీకం!" అన్నాను.

"భలేవాడివే రారా" అంటూ కారు తలుపు తీసాడు.

నేను కారులో కూర్చున్నాను.

పుండరీకం నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళి అతని అర్ధాంగికి, పిల్లలకు నన్ను పరిచయం చేసాడు. ఆ పూట భోజనం చేయనిదే విడిచేది లేదని నన్ను బలవంతం చేసాడు. నేను కాదనలేకపోయాను. భోజనాలైన తరువాత పుండరీకానికి నా సంగతంతా చెప్పాను. వాడు అంతా విని నాకో సలహా చెప్పాడు. నేను ముందు కొంచెం భయపడినా వాడు చెప్పింది ఒప్పుకోక తప్పలేదు.

* * *

సాయంత్రం నాలుగు గంటలయింది.

"గుడ్ యీవినింగ్" అన్న శ్రావ్యమైన కంఠం విని కార్యదర్శిగారు తలెత్తి చూసారు. లేడీ షూ, చేతికి బంగారు గొలుసువాచీ, చేతిలో చిన్న హేండ్ బాగ్ పాతిక సంవత్సరాల సౌందర్యరాశి ఆయన ముందు నిల్చుంది.

కార్యదర్శిగారు ఆమె సౌందర్యం తిలకించి కొంచెం కంగారుపడ్డారు.

"కమాన్.... టేక్ యువర్ సీట్" అంటూ కుర్చీ చూపించారు.

ఆమె కూర్చుంది....

"నా పేరు మిస్ చంచల. నేను ఫలానా కంపెనీలో పనిచేస్తున్నాను. మీకు పెరసనల్ స్టెనో కావాలని వేసిన మీ ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూసి నేను కూడా ట్రై చేద్దామని" ఆమె గడగడ చెప్పుకుపోతోంది.

కార్యదర్శిగారు టేబిలమీద మోచేతులుంచి ఆమె అందాన్ని తిలకిస్తూ గుటకలు వేస్తున్నారు.

"మీ వుద్దేశం...." అందామె.

"ఆఁ! ఆఁ! తప్పకుండా. మీలాంటి క్వాలిఫైడ్ ఎండ్ ఎక్స్‌పీరియన్సుడు హేండ్సు దొరకడమే కష్టం. మీకు అభ్యంతరం లేకపోతే యివాళ నుంచే డ్యూటీలో జాయిన్ కావచ్చు" అన్నారు.

"కాని...."

"జీతం ప్రస్తుతం మూడు వందలు. రెండు నెలల తరువాత 50 రూపాయలు ఇంక్రిమెంట్ సరా"

"థాంక్స్. కాని నేనా కంపెనీలో ఎకౌంట్స్ సెటిల్ చేసికొని నెలాఖరున జాయిన్ అవుతాను"

"ఎకౌంట్స్ తరువాత తాపీగా సెటిల్ చేసుకోవచ్చు. మీకు అంతగా కావలిస్తే ఒక నెల పే అడ్వాన్సు తీసుకెళ్లండి" అంటూ డ్రాయరులో నుంచి మూడు వంద రూపాయల కాగితాలు తీసి ఆమె ముందుంచాడు.

"వెరి మెనీ థాంక్సు" అంటూ ఆమె వాటిని తీసి బేగులో పెట్టుకుంది.

"అదుగో టైప్‌మిషన్. మీ ఎపాయింట్‌మెంట్ ఆర్డరు టైప్‌చేసి యివ్వండి. సంతకం చేస్తాను"

ఆమె ఎపాయింట్‌మెంట్ ఆర్డర్ టైప్ చేసి ఆయన కిచ్చింది. అతను సంతకం చేసి ఆమెకొక కాపీ యిచ్చాడు.

"ఏమండీ పిక్చరుకి వెళదామా" అన్నారాయన.

"సారీ! రేపు తప్పకుండా వెళదాము" అందామె.

'పోనీ బీచ్‌కి...."

ఆమె కాదనలేకపోయింది. కార్యదర్శిగారి కారులో యిద్దరూ బీచికి వెళ్ళారు. చీకటి పడేవరకూ కంపెనీ విషయాలూ, పై విషయాలూ మాట్లాడుకున్నారు.

"ఇక లేద్దామా చాలా రాత్రి అయింది" అందామె.

"మీరు ఎక్కడికెళ్ళాలో చెప్పండి నా కారులో దించుతా" అన్నారు కార్యదర్శిగారు.

"వద్దండీ, ఈ ప్రక్కసందులో మా ఫ్రెండుంది ఆమెను చూసి తరువాత వెళతాను యింటికి. వస్తాను గుడ్‌నైట్" అంటూ ఆమె చీకటిలో మాయమయింది.

కార్యదర్శిగారు ఆమె కనుమరుగయ్యేవరకూ ఆమెను చూస్తూ తరువాత కారెక్కారు.

* * *

"పుండరీకం నీ తెలివి అమోఘం! అఖండం!" అన్నాను.

"వాగుడు కట్టిపెట్టి జరిగిందేదో చెప్పరా" అన్నాడు పుండరీకం.

"ఒరేయ్! ఆ కార్యదర్శిగాడు నన్ను చూసి నీరయిపోయాడంటే నమ్ము. నేనడక్కుండానే ఎడ్వాన్సంటూ మూడు వందలిచ్చాడు. ఇవిగో చూడు" అంటూ చూపించాను.

"అది సరే కాని నువ్వు ఎంత త్వరగా నీ డ్రస్సు మార్చి వేస్తే అంత మంచిది నీకు.... లేకుంటే నేను కూడా...." అన్నాడు వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

"అంత సులభం కాదురోయ్! కనీసం మూడువందలు" అన్నాను నేను కూడా నవ్వుతూ.

*'ప్రజామత' వీక్లీ, 24-3-1963*